RNI NO. TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 210 | ఆదివారం, 06 ఏప్రిల్, 2025 | పేజీలు: 05 | వెల: 5 రూ/-

# విస్తరణ... ఇంకా ఉంది



- తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మళ్లీ వాయిదా
- డైలీ సిరియల్ లా మంత్రివర్గ విస్తరణ
- కొత్త మంత్రుల ఎంపిక విషయంలో అనూహ్య పరిణామాలు
- ఈ నెల 3న విస్తరణ జరుగుతుందని అందరూ ఊహించినప్పటికీ, చివరి నిమిషంలో తెరపైకి ఢిల్లీ నుంచి కొత్త ట్విస్ట్‌లు
- మంత్రుల జాబితా ఖరారైనట్లు పార్టీ ముఖ్య నేతలు భావించినా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కొన్ని పేర్లపై అభ్యంతరం

**హైదరాబాద్**

ఈసారి కచ్చితంగా జరుగుతుంది అనుకున్న తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మళ్లీ వాయిదా పడిపోయింది.. డైలీ సిరియల్ లా వ్యవహారంనడుస్తోవది. కొత్త మంత్రుల ఎంపిక విషయంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 3న విస్తరణ జరుగుతుందని అందరూ ఊహించినప్పటికీ, చివరి నిమిషంలో ఢిల్లీ నుంచి కొత్త ట్విస్ట్‌లు తెరపైకి వచ్చాయి. మంత్రుల జాబితా ఖరారైనట్లు పార్టీ ముఖ్య నేతలు భావించినా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కొన్ని పేర్లపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో పరిస్థితి మారింది. దీంతో, కొత్త జాబితా కోసం పార్టీ నేతలు మళ్లీ కసరత్తు ప్రారంభించారు, మరో ఇద్దరి పేర్లు చర్చలోకి వచ్చాయి.రాష్ట్ర కేబినెట్‌లో ఆరు స్థానాలు ఖాళీగా ఉండగా, సామాజిక, ప్రాంతీయ సమీకరణల ఆధారంగా నలుగురిని ఎంపిక చేసేందుకు గత నెలలో ఢిల్లీ(లో నిర్ణయం జరిగింది. ఉగాది సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌తో సమావేశంలో కూడా విస్తరణ గురించి సూచనలు ఇచ్చారు. కానీ, రాహుల్ గాంధీ కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇప్పటికే కొమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండగా, ఆయన సోదరుడికి మరోసారి అవకాశం ఇవ్వడం ఎందుకని రాహుల్ ఆరా తీశారు. అయితే, రాజగోపాల్‌కు పార్టీలో చేరినప్పుడే మంత్రి పదవి హామీ ఇచ్చామని నేతలు వివరించినప్పటికీ, తుది నిర్ణయం కోసం వేచి చూడాలని రాహుల్ సూచించినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే.. సీనియర్ నేత జానారెడ్డి హైకమాండ్‌కు రాసిన లేఖ సంచలనంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదని, -



# మైనార్టీలపై తమది కపట ప్రేమే

- 30 కోట్ల మంది మైనార్టీల పట్ల తమది కపట ప్రేమేనని నిరూపించుకున్న ఎన్నికల గాంధీలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్**

దేశంలోని 30 కోట్ల మంది మైనార్టీలపై తమది కపట ప్రేమేనని ఎన్నికల గాంధీలు నిరూపించుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. శనివారం తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. అత్యంత కీలకమైన వక్ఫ్ చట్టసవరణ బిల్లుపై లోక్ సభలో చర్చ సందర్భంగా మాట్లాడకుండా ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఖామోష్ అయ్యారని.. ప్రియాంకా గాంధీ అసలే సభకే హాజరు కాకుండా డుమ్మా కొట్టారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ వక్ఫ్ బిల్లు సందర్భంగా లోక్ సభలో వెన్ను చూపారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలిద్దరికీ .

# హెచ్‌సీయూ విషయంలో అబద్ధపు ప్రచారాలు

- బాధ్యులపై కేసులు నమోదు చేయండి
- పునరావృతం కాకుండా చర్యలు తీసుకోండి
- ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు



**హైదరాబాద్**

యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియా నెట్ వర్క్ కృత్రిమంగా వివాదం సృష్టించటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.కంచె గచ్చిబౌలి లోని సర్వే నెంబర్ 25లో ఉన్న భూముల్లో గత 25 ఏండ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్ బీ తో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు బిల్డింగ్ లు, రెసిడెన్షియల్ అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ బిల్డింగ్ లను నిర్మించారు. వాటిని నిర్మించేటప్పుడు ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదని అధికారులు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకు వచ్చారు. అప్పుడు వన్యప్రాణుల -

# ఎంఐఎం కోటలు బద్దలు కొడతాం






- తమకు సంఖ్యా బలం లేదని అందరూ అంటున్నారు
- కానీ అభివృద్ధిని కాంక్షిచే వారు బీజేపీకే ఓటు వేయబోతున్నారు
- ఇక అధికారంలో ఎవరు ఉన్నా మజ్లిస్‌కు హైదరాబాద్ రాసి ఇవ్వడం అలవాటుగా మారింది

**హైదరాబాద్**

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు తమదే అని రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం కిషన్ రెడ్డి మాట్లాడుతూ... తమకు సంఖ్యా బలం లేదని అందరూ అంటున్నారని.. కానీ అభివృద్ధిని కాంక్షిచే వారు బీజేపీకే ఓటు వేయబోతున్నారని చెప్పారు. ఇక అధికారంలో ఎవరు ఉన్నా మజ్లిస్‌కు హైదరాబాద్ రాసి ఇవ్వడం అలవాటుగా మారిందన్నారు. అందులో భాగంగానే ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఎవరు ఉంటే వాళ్లతో

# తాను దంతేశ్వరి మాత ఆశీస్సులు పొందా

- మావోయిస్టులకు అమిత్ షా సవాల్
- వచ్చే నవరాత్రి నాటికి ఎర్ర బీభత్సం అంతం కావాలన్నారు.
- ప్రపంచానికి చాటి చెప్పే పాండుం ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది
- మోదీ నుంచి తానొక సందేశం తెచ్చా.. వచ్చే ఏడాది దేశంలోని ప్రతీ గిరిజన జిల్లా నుంచి కళాకారులను ఒకే పేరుతో బస్తర్ పాండుం ఉత్సవాలకు తీసుకొస్తాం"



# సంపాదకీయం

## మహోన్నత పార్లమెంటేరియన్

భారత దేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేత జగ్జీవన్ రామ్. అతి చిన్న వయస్సులో (27 ఏళ్లకే) శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించిన ప్రజానాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, బాబూ జగ్జీవన్ రాం. పొలిటికల్ కింగ్ మేకర్‌గా రాజకీయంలో రాణించి, అధికారం కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసమే పనే చేసిన మహోన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం. యాభై ఏళ్ళ పార్లమెంట్‌లో సభ్యునిగా కొనసాగిన సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, ఛాందా గ్రామంలో శిబిరం, బసంతి దేవి దంపతులకు జగ్జీవన్ జన్మించారు. ఆయన ఒక పేద దళిత కుటుంబంలో జన్మించడంతో ఎన్నో అవమానాలను, ఛీత్కారలను ఎదుర్కొన్నారు. చిన్ననాడే తండ్రి చనిపోవడంతో సాంఘిక, ఆర్థిక ఇక్కట్ల మధ్య తల్లి వసంతీదేవి సంరక్షణలో తన చదువు కొనసాగించారు. రాత్రింబవళ్ళు భోజ్‌పురితో పాటు హిందీ, ఇంగ్లీషు, బెంగాలి, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్, కలకత్తా విశ్వ విద్యాయం నుంచి డిస్టింక్షన్‌లో బిఎస్సీ డిగ్రీ పూర్తి చేసి పట్టభద్రు డయ్యారు. పీజీ చదువు పూర్తి చేశారు. కార్మికుల కోసం పోరాడి 35వేల మంది కార్మికులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అనేకమంది జాతీయ నాయకుల దృష్టిలో పడ్డారు. ఆయన జీవితకాలం 78 ఏళ్ళు అయితే అందులో 52 ఏళ్ళు రాజకీయ జీవితం గడిపారు. 1952లో భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభ ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిది సార్లు గెలిచారు. ఏకధాటిగా 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన ప్రత్యేకత చాటుకున్నారు. మొదటి శ్రేణి పార్లమెంట్ రియన్‌గా నిలిచారు. మంత్రి మండలిలో అతి చిన్న వయసుడ్కైన జగ్జీవన్‌రామ్‌ను అందరూ 'బేబి మినిష్టర్' అని పిలిచేవారు. ప్రజలంతా ప్రేమతో 'బాబుజీ' అని పిలిచేవారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, ఆహార శాఖ మంత్రిగా, రైల్వే మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఎన్నో సేవలనందించిన ప్రగతిశీలి ఆయన. దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చెయ్యటంలో కీలకపాత్ర పోషించారు. 1942లో కాంగ్రెస్ లో చేరి, జగ్జీవన్ 1969లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1977లో ఇందిరా గాంధీతో విభేదించి పార్టీ నుంచి బయటకు వచ్చి 'ప్రజాస్వామ్య కాంగ్రెస్' పార్టీ ఏర్పాటు చేశారు. ఇంద్రాణిదేవితో బాబుజీకి 1935 జూన్ 1న వివాహం జరిగింది. ఇంద్రాణి కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు. ఆయన కుమార్తె మీరాకుమార్ తండ్రి ఆదర్శాలతోనే పెరిగి, ఆయన బాటలోనే కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా దేశానికి సేవలందించారు. బాబుజీ గొప్ప రచయిత అన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆయన హిందీలో, ఇంగ్లీషులో రచనలు చేశారు. "భారత దేశంలో కులం సవాళ్ళు", " జీవన సరళి వ్యక్తిత్వ వికాసం" అను రెండు విశిష్ట గ్రంథాలను రాశారు. ఆయన గొప్ప అధ్యయనశీలి. ఉజ్జయినిలోని విక్రమ విశ్వ విద్యాయం 1967లో జగ్జీవన్‌రామ్‌కి 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన సేవను మెచ్చిన కాన్పూర్ విశ్వవిద్యాయం 1968లో డాక్టరేట్‌తో సత్కరించింది. జగ్జీవన్ రామ్ అమూల్యరత్నం" అని గాంధీ ఒక సందర్భంలో రాశారు. 1986 జూల్కై 6వ తేదీన బాబూజీ తన తుదిశ్వాస విడిచారు. బాబు జగ్జీవన్ రామ్ వరుసగా ప్రజాప్రతినిధిగా, భారత దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన క్యాబినెట్ మంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన కేంద్ర కార్మిక మంత్రిగా 1946 నుండి 1952 సంవత్సరం వరకు ఉన్నారు. ఆయన 1952 నుండి 1956 సంవత్సరం వరకు కేంద్ర సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1956 నుండి 1962 వరకు కేంద్ర రవాణా, రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు. 1962 నుండి 1963 సంవత్సరం వరకు ఆయన కేంద్ర రవాణా మరియు సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1966 నుండి 1967 సంవత్సరం వరకు కేంద్ర కార్మిక, ఉపాధి మరియు పునరావాస శాఖ మంత్రిగా పని చేశారు. 1967 నుండి 1970 వరకు కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. 1970–1974, 1977 – 1979 కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్నారు.

1974 నుండి 1977 వరకు కేంద్ర వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారు. సెప్టెంబర్ 1976 నుండి 1983 ఏప్రిల్ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడిగా పని చేశారు. భారత ఉప ప్రధానమంత్రిగా, 1977 మార్చి 24 నుండి 1979 జూలై 28 వరకు విధులు నిర్వర్తించారు.

# కమనీయం రామయ్య కళ్యాణానికి



అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల తర్వాత రాష్ట్రంలో ఆరు పెద్ద దేవాలయాలు ఉండేవి... అవి దేవాదాయ శాఖచే 6ఏ టెంపుల్స్ గా గుర్తింపు పొందాయి. శ్రీశైలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, భద్రాచలం, వేములవాడ దేవాలయాలను 6ఏ టెంపుల్స్ అని పిలిచే వారు . 6ఏ అంటే ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ అని అర్థం. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్‌లో వేములవాడ , భద్రాచలం తెలంగాణలోకి రావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా, భద్రాచలం మండలంలోని రెవెన్యూ గ్రామం భద్రాచలం. ఇక్కడ భక్త రామదాసు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము కలిగిన గోదావరి నది దక్షిణ తీర పుణ్యక్షేత్రం. దీనిని భద్రాద్రి, శ్రీరామ దివ్యక్షేత్రం అనే పేర్లతో కూడా పిలుస్తారు. పూర్వపు జిల్లా కేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కి.మీ.ల దూరంలో ఉంది. పూర్వం భద్రుడు అను భక్తుడు శ్రీ రాముడుకి తపస్సు చేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీ రాముడు వెలసే విధంగా వరం పొందాడని అంటారు. ఆ కొండకు భద్రుడు పేరు మీద భద్రగిరి అని తరువాతి కాలంలో ఆ పట్టణానికి భద్రాచలం (భద్రం అచలం) అని పేరు స్థిరపడింది. గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలనా కాలంలో భద్రాచల ప్రాంతానికి తహశీల్దారుగా కంచెర్ల గోపన్న పని చేసే వాడు. ఇక్కడికి సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామ భక్తుడు. తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్ను (6 లక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వానికి జమ చెయ్యకుండా, 1645 – 1680 మధ్య కాలంలో భద్రగిరిపై శ్రీ రాముడు వెలసిన ప్రదేశమందు రామాలయాన్ని నిర్మించాడు. సీతా రామ చంద్ర స్వాములకు రకరకాల నగలు – చింతాకు పతకం, పచ్చల పతకం మొదలైనవి చేయించాడు. ఆ సొమ్ము విషయమై తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా, ఆ చెరసాల నుండి తనను విముక్తి చెయ్యమని రాముణ్ణి గోపన్న ప్రార్థించాడు. ఆ సందర్భంలో రామునిపై రచించి, పాడిన పాటలే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. గోపన్న కీర్తనలకు తన్మయత్వం చెందిన రాముడు, దేవాలయ నిర్మాణానికి ఉపయోగించిన ప్రభుత్వ సొమ్మును తానీషాకు చెల్లించి, గోపన్నకు చెరసాల నుండి విముక్తి ప్రసాదించాడని ఐతిహ్యం. అలా కంచెర్ల గోపన్నకు రామదాసు అనే పేరు వచ్చింది. దేవాలయమందు సీతా, లక్ష్మణ, హనుమంత సమేతంగా శ్రీరామ చంద్రుడు ఇక్కడ అత్మారాముని రూపంలో కొలువుతీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. మరే దేవస్థానం లోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమికి వైభవంగా జరిగే సీతారామ కళ్యాణ ఉత్సవానికి అశేష ప్రజానీకం వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళ్యాణోత్స వానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపించడం సాంప్రదాయం. ఇక్కడ శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. రామ దాసు చేయించిన వివిధరకాల నగలు దేవస్థానపు ప్రదర్శనశాలలో ప్రదర్శనకు ఉంచారు. భద్రాచలం లోని శ్రీరాముడిని వైకుంఠ రాముడు అని అంటారు. ఇక్కడి రాముడు వైకుంఠమునకు వెళ్ళిన తరువాత మరల భూమి మీదకి వచ్చి, తన భక్తుడైన భద్రుడి కోరిక తీర్చి భద్ర పర్వతంపై నిలిచాడు. భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి కల్యాణ బ్రహ్మోత్సవాల సందడి ఊపందుకుంది. కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కల్యాణ బ్రహ్మోత్సవాల్లో 6న కల్యాణం, 7న పట్టాభిషేకం నిర్వహించ నున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇప్పటికే భద్రాచలం పట్టణాన్ని అందంగా ముస్తాబు చేశారు. పట్టణ ప్రధాన కూడళ్లలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. రామాలయానికి, మిథిలా స్టేడియానికి రంగులు వేసి విద్యుత్ లైట్లను అలంకరించారు. రాములోరి కళ్యాణం, పట్టాభిషేకం జరిపే మిథిలా ప్రాంగణంలో సెక్టార్‌ల వారీగా బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు భద్రాచలం వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోంది. ఇప్పటికే అధికారులు శ్రీరామనవమి వేడుక నిర్వహణపై పలుమార్లు దేవస్థాన ఈవో రమాదేవి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు కల్యాణ మహోత్సవంలో వినియోగించే తలంబ్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. సాధారణంగా రోజువారి నిత్య కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలు పసుపు రంగులో ఉంటాయి. అయితే ఏడాది కోసారి నిర్వహించే కల్యాణ మహోత్సవాల్లో మాత్రం తలంబ్రాలు ఎరుపు రంగులో ఉంటాయి. భద్రాద్రిలో ఈ తలంబ్రాలను ప్రత్యేకంగా తయారు చేస్తారు. బియ్యంలో పసుపు, కుంకుమ, నెయ్యి, బుక్కా, గులాములు, సుగంధ ద్రవ్యాలు కలిపి తలంబ్రాలను తయారు చేస్తారు. ఇలా తలంబ్రాలను తయారు చేయడం భక్త రామదాసు కాలం నుంచి ఆచారంగా వస్తోంది. గత కొన్ని సంవత్సరాల నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భక్తులు.. వడ్లను గోటితో వలిచి సీతారాముల కల్యాణంలో వినియోగించేందుకు భద్రాచలం తీసుకువస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా, వరంగల్, కరీంనగర్, కొత్తగూడెం, మణుగూరు, హైదరాబాద్?లోని భక్తులు గోటితో వలిచిన వడ్లను స్వామివారికి సమర్పిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భద్రాద్రి రామయ్యకు కోటి గోటి తలంబ్రాలు సమర్పిస్తున్న మహిళలు ఈ ఏడాది 2 క్వింటాళ్ల వడ్లను వలిపించి భద్రాద్రి సన్నిధికి అందించారు. ఈనెల 6న జరగనున్న సీతారాముల కళ్యాణం మహోత్సవంలో ఈ కళ్యాణ తలంబ్రాలను వాడనున్నారు. శ్రీరామనవమి రోజున తలంబ్రాలకు 60 కౌంటర్లు, ప్రసాదాలకు 19 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ముత్యాల తలంబ్రాల పొట్లాలను ఆర్టీసీ కార్గో, ద్వారా బుక్ చేసుకున్న వారికి పంపిస్తారు. నేరుగా కౌంటర్ల లోనూ విక్రయించ నున్నారు. ఈ ఏడు రాష్ట్ర ప్రభుత్వం 2.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆన్‌లైన్‌లో సైతం భక్తులు కళ్యాణోత్సవాలను వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడు ఏప్రిల్ 5న ఎదుర్కోలు, 6న కళ్యాణం, 7న పట్టాభిషేకం, 8న సదస్యం, 9న తెప్పోత్సవం, 10న ఓంజల్ సేవ, 11న వసంతోత్సవం, 12న చక్రతీర్థం పుష్పయాగం నిర్వహించ బడతాయి. తద్వారా బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రప్రథమంగా ప్రభుత్వ పక్షాన పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించ నున్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# బెట్టింగ్ యాప్‌లను నిషేధించలేరా?

ఆన్‌లైన్ బెట్టింగులలో కాసినో యాప్‌ల నుండి పోకర్, రౌలెట్, బ్లాక్ జాక్, జంగ్లీ, రమ్మీ వంటి వాటితో పాటు లాటరీ యాప్‌లు.. ఇలా చెప్పుకుంటూపోతే కోకొల్లలు. ఇవన్నీ ఎక్కడో విదేశాల నుండి నడిపిస్తున్నా మన రాష్ట్రాల్లో మరింత ప్రభావం చూపిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ మెట్రో రైల్లో ఓ బెట్టింగ్ యాప్‌ను అడ్వర్టైజ్ చేసినప్పుడు పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో తొలగించాల్సి వచ్చింది. ఈ బెట్టింగ్ యాప్‌లను సినీ, క్రీడా స్టార్లు ప్రమోట్ చేయడంతో ఈ మోజులో సామాన్యులూ పడుతున్నారు. వీటికి తోడు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల చెలామణీ విపరీతంగా పెరిగింది. పెద్ద పెద్ద సెలబ్రెటీలు, సినిమా స్టార్లు, రాజకీయ నాయకుల పిల్లలు దొరికిపోవడం చూస్తున్నాం. ఇక సంక్రాంతి వచ్చిందంటే చాలు. కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతాయి. కోర్టులు వీటిని నిషేధించినా రాజకీయ నాయకులే దగ్గరుండి మరీ కోడిపందేలు ఆడించడం చూస్తున్నాం. యువతతో పాటు స్కూల్ పిల్లలు సైతం వారి తల్లిదండ్రుల ఫోన్లలో ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఫోన్ నుండే యుపిఐ ల ద్వారా లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్న ఘటనలు మన కళ్ల ముందే కనబడుతున్నాయి. నిర్దిష్టంగా లెక్కలు లేకపోయినా వీటి పర్యవసానంగా ఆత్మహత్యలు చేసుకున్నవారు, తమ ఆస్తులను అమ్ముకున్నవాళ్లు కూడా ఉన్నారు. ఆర్థికంగా అనేక కుటుంబాలు చితికిపోయాయి. వీటి కోసం హత్యలు కూడా జరిగినట్టు వార్తలు. ఈ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సెలబ్రెటీలు, యూట్యూబర్లు కొంతమంది ఇవి నిషేధించినవని, వీటి తీవ్రత ఈ స్థాయిలో ఉంటుందని తెలియక ప్రమోట్ చేశామని తప్పించుకుంటున్నారు. ఇదే బెట్టింగ్ క్రీడలో వందల కోట్ల రూపాయలు కాజేసిన వారిపై ఇక్కడ కేసులు నమోదు కావడంతో దుబారు లాంటి దేశాలకు పారిపోయినా ప్రభుత్వాలు కళ్లప్పగించి చూస్తున్నాయి. ఈ బెట్టింగ్ యాప్‌లపై 'పబ్లిక్ గేంబ్లింగ్ యాక్ట్ 1867' వచ్చినా, అనంతర కాలంలో వీటిపై నిర్ణయాధికారం ఆ యా రాష్ట్రాలకు వదిలేయడంతో అడ్డూఅదుపూ లేకుండా పోయింది. మన రాష్ట్రంలో 1974లో ఎ.పి. గేంబ్లింగ్ యాక్ట్ వచ్చినా గోవా, సిక్కిం తదితర రాష్ట్రాల్లో ఉండడంతో ఇక్కడ నియంత్రణ సాధ్యం కాలేదు. ఈ బెట్టింగ్ ఆటల ప్రభావం మరింత పెరగడంతో 2023లో 174 యాప్‌లను నిషేధించినా ఇంకా అనేక యాప్‌లకు అనుమతులు ఉండడం, మరికొన్నిటిని విదేశాల నుండి నిర్వహిస్తుండడంతో ఈ జూదం మోజు మన దేశంలో కూడా తీవ్రంగా ఉంది.

ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై 28 శాతం జి.ఎస్.టి వసూలు చేస్తున్న మన ప్రభుత్వానికి ఏడాదికి 7 వేల కోట్లు ఆదాయం వస్తున్నది. వచ్చే ఏడాది 14 వేల కోట్లు జిఎస్‌టి వసూళ్ల టార్గెట్‌గా పెట్టుకున్నట్లు కేంద్ర రెవెన్యూ సెక్రటరీయే ప్రకటించారంటే దీని ఆదాయంపై ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ వున్నదో అర్థమౌతోంది. ప్రజలు ఎలా పోయినా పరవాలేదు. మా ప్రభుత్వానికి ఆదాయం రావాలనే ధోరణి ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. అంటే సులభంగా ఆదాయం రావడమనేది ప్రజలకే కాదు, ప్రభుత్వాలకు కూడా అలవాటయ్యిందనే వాదనలకు బలం చేకూర్చినట్లయ్యింది. పన్నుల రూపంలో ఆదాయం వస్తుందనే పేరుతో దీనిపై నియంత్రణ చేయకపోవడం దుర్మార్గం. ఈ ఆన్‌లైన్ జూదానికి యువత బానిసలు అవుతుంటే.. విలాసాల కోసమో, సులువుగా డబ్బు సంపాదించేయాలనే యావతోనో మోసపోతుంటే... అది ప్రమాదమని తెలిసి, తప్పు అని గ్రహించినా ప్రభుత్వాలు ఎందుకని ఎటువంటి నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు? సాంఘికంగా ఇంతటి ప్రభావాన్ని చూపుతున్నవాటిని ఎందుకు నిషేధించలేకపోతున్నవి? కేవలం వీటి ద్వారా ప్రభుత్వాలకు వచ్చే ఆదాయమే కొలమానమా? ఇది పెద్ద మాఫియాగా మారడం, హవాలా రూపంలో డబ్బును చలామణీ చేయడం, ఇవి ప్రభుత్వాలనే శాసించే స్థాయికి వెళ్లాయంటే దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎంత బలమైనవారో ఊహించవచ్చు! కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశభక్తి గురించి నిత్యం వల్లె వేస్తూ వుంటుంది. మరి యువత ఈ బెట్టింగ్, జూదం యాప్‌ల ద్వారా నాశనమైపోతుంటే పట్టనట్లుండడం ఏం దేశభక్తి? ఇటువంటి వాటిని నిషేధించవద్దని ఎవరూ చెప్పలేదు. మరి ఎందుకు నిషేధించడం లేదు? అనేక దేశాల్లో 1949 లోనే ఇటువంటి బెట్టింగ్, జూదాలను సంఘ విద్రోహ చర్యలుగా పరిగణించి నిషేధించాయి. మన దేశంలో కూడా దేశవ్యాప్తంగా ఒకే చట్టం రావాలి.

వీటిని అడ్డగోలుగా ప్రమోట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వీటి సూత్రధారులను, మోసగించి విదేశాలకు పారిపోయిన వారిని దేశంలోకి రప్పించి వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి. యువత బెట్టింగ్, జూదం, మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా కౌన్సిలింగ్ సెంటర్ల ద్వారా పరివర్తన కలిగించాలి. యువతకు ఉపాధి కల్పనపై ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలి. కుటుంబాల్లో కూడా ఇటువంటి జూదాల జోలికి వెళ్లకుండా రెగ్యులర్‌గా కనిపెట్టుకుంటూ ఉండాలి. అప్పుడే యువతను ఈ బెట్టింగుల నుండి కాపాడుకోగలం.

# పాత్రికేయం- బాధ్యత, ప్రమాణాలు



పాత్రికేయ వృత్తి, మరో మాటలో చెప్పాలంటే జర్నలిజం, సమాజానికి వార్తలు, అలాగే సమాచారాన్ని అందించే ఒక గౌరవ ప్రదమైన, కీలకమైన వృత్తి. అయితే, ఈ గౌరవంతో పాటు, పాత్రికేయులపై బాధ్యత కూడా ఉంటుంది. వారు అందించే సమాచారం ఖచ్చితమైనదిగా, నిష్పక్షపాతంగా, ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలి. సంఘటనలు, వాస్తవాలు, ఆలోచనలు, వ్యక్తుల పరస్పర చర్యల గురించి సమాజానికి సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత పాత్రికేయులదే. పాత్రికేయ ప్రమాణాలు అనేవి ఈ వృత్తిలో పనిచేసే ప్రతి ఒక్కరూ పాటించవలసిన నియమాలు, నైతిక విలువలు, ప్రవర్తనా సూత్రాల సముదాయం. ఈ ప్రమాణాలు ముఖ్యంగా సత్యం, నిష్పక్షపాతం, బాధ్యత, గౌరవం, పారదర్శకత అనే పునాదులపై ఆధారపడి ఉంటాయి. పాత్రికేయులు నిజాయితీతో కూడిన సమాచారాన్ని అందించడానికి కట్టుబడి ఉండాలి. వారు ప్రచురించే సమాచారం కచ్చితమైనదిగా, వాస్తవాల ఆధారంగా మరియు సంపూర్ణంగా ఉండేలా జాగ్రత్త వహించాలి. పాత్రికేయులు తమ వ్యక్తిగత అభిప్రాయాలు లేదా రాజకీయ, సామాజిక దృక్పథాలు వార్తల నివేదనపై ప్రభావం చూపకుండా నిష్పక్ష పాతంగా వ్యవహరించాలి. వాదనలు, అభిప్రాయాలు, వాస్తవాలను స్పష్టంగా వేరు చేయాలి. మీడియా ప్రతినిధులు సమాజం, పాఠకులు మరియు తమ వృత్తి పట్ల బాధ్యత కలిగి ఉండాలి. వారు ప్రచురించే తప్పుడు వార్తలు, అపార్థాలు లేదా అసత్య ప్రచారం వల్ల కలిగే పరిణామాలకు బాధ్యత వహించాలి. పాత్రికేయులు వ్యక్తుల గోప్యతను, గౌరవాన్ని కాపాడాలి. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను అనవసరంగా ప్రచురించ కూడదు. పాత్రికేయులు తమ వార్తల మూలాలు, సమాచారాన్ని సేకరించిన పద్ధతులు, ముఖ్యంగా క్షమాపణ చెప్పాల్సిన సందర్భాలను బహిర్గతం చేయాలి. ఒకవేళ తప్పులు జరిగితే, వాటిని నిర్భయంగా అంగీకరించాలి, సరిదిద్దాలి. పాత్రికేయ ప్రమాణాలు ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను, సామాజిక న్యాయాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి నైతికత, నిజాయితీ మరియు బాధ్యతతో కూడిన పాత్రికేయత్వానికి మార్గదర్శకాలుగా ఉంటాయి. పాత్రికేయుల నిబద్ధత అంటే వారు తమ వృత్తిని నిజాయితీగా, నిష్పక్షపాతంగా మరియు బాధ్యతాయుతంగా నిర్వహించడానికి దృఢంగా ఉండటం. వారు ప్రజలకు కచ్చితమైన మరియు సమతుల్య సమాచారాన్ని అందించడానికి నిరంతరం ప్రయత్నించాలి. తమ వ్యక్తిగత అభిప్రాయాలు లేదా ప్రయోజనాలు తమ పనిని ప్రభావితం చేయకుండా చూసుకోవడం వారి ముఖ్య కర్తవ్యం. పాత్రికేయులు తమ పనిని రాజకీయ లేదా ఆర్థిక ఒత్తిడి లేకుండా నిర్వహించడానికి స్వేచ్ఛగా ఉండాలి. పాత్రికేయులు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పని చేయాలి మరియు ప్రజలకు సమాచారం మరియు అవగాహన కల్పించడానికి ప్రయత్నించాలి. పాత్రికేయుల నిబద్ధతలో అనేక అంశాలు ఉంటాయి. పాత్రికేయులు నిజాయితీగా ఉండాలి. వారు సేకరించే నివేదించే సమాచారం ఖచ్చితమైనదని నిర్ధారించుకోవాలి. పాత్రికేయుల నిబద్ధత ప్రజాస్వామ్య సమాజానికి చాలా ముఖ్యమైనది.

వారు ప్రజలకు ఖచ్చితమైన మరియు సమతుల్య సమాచారాన్ని అందించినప్పుడు, ప్రజలు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి మరియు ప్రభుత్వం, ఇతర సంస్థలను జవాబుదారీగా ఉంచడానికి వీలవుతుంది. అయితే, పాత్రికేయుల నిబద్ధతకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. రాజకీయ లేదా ఆర్థిక ఒత్తిళ్లు, తప్పుడు సమాచారం వ్యాప్తి, వ్యక్తిగత భద్రతా సమస్యలు వంటి అనేక అంశాలు వారి పనిని ప్రభావితం చేస్తాయి. అయినప్పటికీ, పాత్రికేయులు తమ నిబద్ధతను కొనసాగించడానికి మరియు ప్రజలకు ఖచ్చితమైన, సమతుల్య సమాచారాన్ని అందించడానికి నిరంతరం కృషి చేయడం చాలా అవసరం. పాత్రికేయ ప్రమాణాలను పాటిస్తూ, నిబద్ధతతో పనిచేయడం ద్వారా వారు సమాజంలో విశ్వసనీయతను కాపాడుకోవచ్చు మరియు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవచ్చు.

# హెచ్‌సీయూ విషయంలో అబద్ధపు ప్రచారాలు

-మొదటిపేజీ తరువాయి

సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు.అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని సమావేశంలో చర్చ జరిగింది. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాస్తవాలు వెల్లడించే లోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లుగా ఆడియోలు, బుల్లోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా వాటినే నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయిందని అన్నారు. ఏకంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా రండన్ లాంటి వాళ్లందరూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోల పోస్టు చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారని సమావేశంలో చర్చ జరిగింది. ఈ భూములపై మొట్ట మొదటగా ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్ జా కొద్ది సేపట్లోనే తన పోస్టును తొలిగించి క్షమాపణలు చెప్పారని, కానీ మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారని అధికారులు అభిప్రాయపడ్డారు. కంచె గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందని ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇదే తీరుగా ఇండో పాక్, ఇండో చైనా సరిహద్దుల్లాంటి వివాదాలు,



ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాల్లో ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తుల్లో యుద్ధాలు జరిగే ప్రమాదముంటుందని చర్చ జరిగింది. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్ ను మించిన మహమ్మారిలాంటివని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏఐ ఫేక్ కంటెంట్ ను పసిగట్టేలా అవసరమైన అధునాతన ఫోరెన్సిక్ హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ టూల్స్ను సమకూర్చుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# హైదరాబాద్‌లో బీజేపీ వర్సెస్ ఎంఐఎం

# క్రాస్ ఓటింగ్ పైపూ ఆశలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ స్థానిక సంస్థల కేటగిరి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పో లింగ్ అనివార్యమైంది. ఇప్పటి వరకు ఎం ఐ ఎం, కాంగ్రెస్ అవగాహనతో ఎమ్మెల్సీ సీటు ను ఎంఐఎం ఏకగ్రీవంగా ఎగురేసుకుపోతుందని భావించిన రాజకీయ వర్గాలు ఇప్పుడు బి జెపి కూడా పోటీలో నిలవడంతో గెలుపు ఎవరిదనేది ప్రధానంగా చర్చ మొదలైంది. హైదరాబాద్‌లో స్థానిక సంస్థ కేటగిరీ ఎమ్మెల్సీలో బిజెపికిగానీ, బిఆర్ఎస్‌కు గానీ పూర్తిస్థాయి లో బలం లేదు. దీంతో వీరు పోటీలో నిలవరనేది ప్రచారం జోరుగా సాగింది. కాంగ్రెస్, ఎంఐ ఎంలు అవగాహనతో ఎమ్మెల్సీని మరోమారు ఎంఐఎంకు దక్కుతుందని భావిస్తూ వ స్తున్నారు.అయితే, నామినేషన్లకు చివరి రోజు న బిజెపి నామినేషన్ దాఖలు చేయడంతో ఓటింగ్ తప్పనిసరిగా మారింది. ప్రస్తుతం స్థా నిక సంస్థల కేటగిరి ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక సంస్థలు జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులు ఉన్నాయి. కంటోన్మెంట్ బో ర్డుకు ఎన్నికలు జరగనందున సభ్యులెవ్వరూ లేరు. ఇక జిహెచ్ఎంసిలో హైదరాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే కార్పొరేటర్లు, ఎక్స్అఫిషియో సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. ఇందులో బిజె పి, బిఆర్ఎస్‌లకు ఎంఐఎం పార్టీకన్నా తక్కువగా ఓట్లు ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క కార్పొరేటర్ కూడా లే రు. ఇక ఎక్స్అఫిషియో సభ్యుడిగా రాజ్యసభ కు ప్రాతినిథ్యం వహిస్తున్న ఒక్క ఎంపీ ఉన్నా రు.దీంతో కాంగ్రెస్ పార్టీ పోటీలో లేదు. లోకల్ బాడీ కేటగిరీ ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. ఈ సీటును గెలుచుకునేందుకు బీజెపి రంగంలోకి దిగినట్టు చర్చ మొదలైంది. ఈ ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్, బీజెపిలు అంతర్గతంగా చర్చించుకున్నాకనే బీజెపి పోటీలోకి వచ్చినట్టు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు హైదరాబాద్ జిల్లాలో కార్పొరేటర్లు 20 మంది, 11 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు మొత్తం ఓటర్లు 31మంది ఉన్నారు. బీజెపి నుంచి 20 మంది కార్పోరేటర్లు, 6 మంది ఎక్స్అఫిషియో సభ్యులు మొత్తం ఓటర్లు 26 మంది బలం ఉంది. ఎంఐఎం పార్టీకి కార్పొరేటర్లు 41 మంది, ఎక్స్అఫిషియో సభ్యులుగా 7 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపి, ఒక ఎమ్మెల్సీ మొత్తం ఓటర్లు 50 మంది ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎక్స్ అఫిషియో సభ్యులు 5 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓటింగ్ జరిగితే ఎంఐఎం గెలవడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే, బీజెపి పోటీకి దిగడంతో ఒక్కసారిగా రాజకీయ సమీకరణలు మారాయి. మొత్తం ఓటర్లుగా 112 మంది ఉండగా ఇందులో కార్పొరేటర్లు 81 మంది, ఎక్స్ అఫిషియో సభ్యులు 31 మంది ఉన్నారు. అభ్యర్థి గెలవాలంటే 57 ఓట్లు రావాల్సి ఉంది. ఇటు ఎంఐఎంకు 50 మంది ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు 6 మంది ఉండటంతో ఈ రెండు పార్టీలు ఈపాటికే




అవగాహనతో ఉన్నట్టు ప్రచారంలో ఉంది. కాంగ్రెస్, ఐఎంఎంలు కలిస్తే 56 ఓట్లు, బీజెపి బీఆర్ఎస్‌లు కలిస్తే 56 ఓట్లు రావడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే, కొందరు కార్పొరేటర్లు బీఆర్ఎస్, బీజెపిల నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన విషయం తెలిసిందే.ఎమ్మెల్యే కేటగిరీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 8 మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజెపి పోటీకి దిగలేదు. కానీ, ఇప్పుడు స్థానిక సంస్థల కోటాలోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే 57 ఓట్లు కావాల్సి ఉండగా.. 25 మంది ఓటర్లున్న బీజెపి పోటీలోకి దిగడం రాజకీయ వర్గాలను కాస్తంత ఆలోచనల్లోకి నెట్టేసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌తో బీజెపి చర్చించిన అనంతరమే బీజెపి పోటీలోకి వచ్చినట్టు, ఈ రెండు పార్టీల ఓట్లను లెక్కించుకుని మరీ రంగంలోకి చేరినట్టు తెలుస్తుంది. ఈ రెండు పార్టీలు కలిస్తే ఓట్లు 56గానూ ఉన్నాయి. అయితే, ఆ రెండు, ఈరెండు పార్టీల బలాబలాలు మాత్రం సమంగా కనిపిస్తున్నాయి. ఏ పార్టీ ఓట్లు క్రాస్ జరుగుతాయనేది ఆసక్తికరంగా మారింది.ప్రతిష్టాత్మకంగా మారిన ఎమ్మెల్సీ ఎన్నికలో ఇరు పార్టీలకు క్రాస్ ఓటింగ్ బెంగపట్టుకుంది. పార్టీ విప్ జారీచేసినా.. సభ్యులు ఎవరికి ఓటు వేస్తారనేది సందేహాన్ని రేకెత్తిస్తుంది.

వరీ మీర్జా రియాజ్ ఉల్ అసన్?

మీర్జా రియాజ్ ఉల్ అసన్ 2019లోనే ఎమ్మెల్సీ ఎన్నికయ్యారు. కానీ ఆ పదవి 2023తోనే ముగిసింది. అందుకే ఇప్పుడు మరో ఛాన్స్ ఇస్తున్నారు. ఆయన 2009లో నూర్ ఖాన్ బజార్, 2016లో డబీర్‌పురా కార్పొరేటర్‌గా విజయం సాధించారు.

ఎవరీ గౌతమ్‌రావు? ఆయన్ని రాజాసింగ్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

బీజేపీ తరఫున పోటీ చేస్తున్న గౌతమ్‌రావు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. ఎప్పటి నుంచో పార్టీకి పార్టీ సిద్ధాంతలకు కట్టుబడి పని చేస్తున్నారు. ఆయన పనిచేశారు. అభ్యర్థిగా గౌతమ్ రావును ప్రకటించడంపై ఎమ్మెల్యే రాజాసింగ్ మండిపడుతున్నారు. కిషన్ రెడ్డిని టార్గెట్ చేసుకొని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన పార్లమెంట్ నియోజకవర్గానికే పదవులు ఇస్తున్నారని మిగతా బీజేపీ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గులాంగిరీ చేసేవాళ్లకే పదవులు కట్టబెడుతున్నారని అసంతృప్తి వ్యక్తంచేశారు.

నెల రోజుల క్రితమే బీజేపీ తీన్ మార్

నెల రోజుల క్రితం జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేరుగా రెండింటిని కైవశం చేసుకున్న బీజేపీ మరో స్థానంలో మద్దతుదారుణ్ని గెలిపించుకుంది. ఉమ్మడి కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ జిల్లాల పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ సీట్లను బీజేపీ తన ఖాతాలో వేసుకుంది. బిజెపి నేతలు మల్క కొమరయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి ఈ రెండు స్థానాల్లో ఘన విజయం సాధించారు. ఉమ్మడి వరంగల్- నల్గొండ- ఖమ్మం టీచర్ నియోజకవర్గంలో బీజేపీ మద్దతు పలికిన పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి ఎంగిలి శ్రీపాల్ రెడ్డి కూడా గెలుపొందదారు.

## ఎంఐఎం కోటలు బద్దలు కొడతాం

-మొదటిపేజీ తరువాయి

అంటకాగి హైదరాబాద్‌ను దోచుకోవడం ఎంఐఎంకు పరిపాటి అయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి ఎంఐఎం కోటలు బద్దలు కొడతామని స్పష్టం చేశారు. సంఖ్యా బలం ఉంటే బీజేపీనే గెలిచేదని.. సంఖ్యా బలం లేదు కాబట్టే ఓటింగ్ జరుగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో 120 మంది ఓటర్లు ఆచితూచి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా, హిందువులకు, హిందూ దేవుళ్లకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇచ్చే పార్టీ మజ్లిస్ పార్టీ అంటూ మండిపడ్డారు. గతంలో హైదరాబాద్‌లో అనేక సార్లు మతకలహాలు ప్రేరింపించిందన్నారు. అలాంటి మజ్లిస్ పార్టీ అభ్యర్థిని ఏకగ్రీవం చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ చేయకుండా ఉండటం రాజకీయ కుట్రే అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ కూడా ఎంఐఎంకు బానిసత్వంతో ఉండే పార్టీలని వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీని పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ కనుసైగలో ఈ రెండు పార్టీలు నడుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రెండూ కూడా ఎంఐఎం పార్టీ అడుగులకు మడుగులు ఒత్తుతూ పెంచి పోషిస్తున్నాయన్నారు. మజ్లిస్‌కు ఓటేస్తే ప్రజలెవరూ కూడా క్షమించరని అన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. ఈసారి కచ్చితంగా హైదరాబాద్ నగరంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని.. మేయర్ పీఠం మీద కూర్చోబోయేది భారతీయ జనతా పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికలకు, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధం లేదని అన్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించి మజ్లిస్ పార్టీని ఓడించాలని... బీజేపీ అభ్యర్థిని గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. పార్టీలో అంతర్గత విభేదాలు ఉండటం సహజమని చెప్పుకొచ్చారు. అలాంటివి ఏవైనా ఉంటే పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావు పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే.

## మైనార్టీలపై తమది కపట ప్రేమే

-మొదటిపేజీ తరువాయి

మైనార్టీలు, ముస్లింల సంక్షేమం, సమస్యలంటే పట్టవని రూడీ అయ్యిందన్నారు. దేశవ్యాప్తంగా మైనారిటీల హక్కులను కాలరాసే కీలకమైన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడకపోవడం దారుణమన్నారు. అత్యధిక మంది మైనార్టీ ఓటర్లకు ఎంపీగా ఉన్న ప్రియాంకా గాంధీ సభకే హాజరు కాకపోవడం మరింత దారుణమన్నారు. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతూ తననుతానే రాజ్యాంగ రక్షకుడిగా ప్రచారం చేసుకుంటున్న రాహుల్ గాంధీ లోక్ సభ సాక్షిగా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుంటే మౌనంగా ఉండటం వెనుక కారణాలమేటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీకి, ఎన్నికల గాంధీలకు ఓట్ల సమయంలోనే మైనార్టీలు గుర్తుకొస్తారా అని నిలదీశారు. టోపీలు పెట్టుకొని ఓట్లడిగి గద్దెనెక్కిన తర్వాత మైనార్టీలను నిండా ముంచడమే కాంగ్రెస్ నైజమని తేలిపోయిందన్నారు. దేశంలో మైనార్టీల హక్కులను కాపాడాది కాంగ్రెస్ పార్టీయేనని రాహుల్ గాంధీ ప్రగ్భలాలు పలుకుతూ ఉంటారని.. వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన ఎటు వెళ్లారు.. ఎందుకు సభలో మైనార్టీల పక్షాన గొంతు విప్పలేదో చెప్పాలన్నారు. ఇద్దరు గాంధీలు లోక్ సభ సభ్యులుగా ఉండి మైనార్టీల తరఫున వక్ఫ్ బిల్లుపై మాట్లాడలేదంటే ఇది ముస్లింలను నట్టేట ముంచడం కాదా అని ప్రశ్నించారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ మొదటి నుంచి ఒకే స్టాండ్ తో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల గాంధీల మాదిరి తాము ముస్లింలు, మైనార్టీలకు ద్రోహం చేయలేదన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టసవరణ బిల్లును రాజ్యసభలో బీఆర్ఎస్ వ్యతిరేకించిందన్నారు. మైనార్టీలకు అండగా నిలవాల్సిన సమయంలో రాహుల్ గాంధీ వెన్ను చూపించారని.. కీలకమైన సమయంలో కాడి పడేసిన ప్రధాన ప్రతిపక్షనేత రేపు మైనార్టీలు, ముస్లింలకు ఎలా అండగా నిలుస్తారని నిలదీశారు.

## విస్తరణ... ఇంకా ఉంది

-మొదటిపేజీ తరువాయి

వాటికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. సామాజికవర్గాల వారీగా కూడా పలువురు నేతలు ఢిల్లీలో లాబీయింగ్‌ను తీవ్రతరం చేశారు. ఇప్పటివరకు సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, వట్టిక శ్రీహరి, వివేక్ పేర్లు ఖరారైనట్లు ప్రచారం జరిగినా, రాహుల్ అభ్యంతరంతో ఈ జాబితాలో మార్పులు సంభవించే సూచనలు కనిపిస్తున్నాయిసీనియర్లు, సామాజిక అంశాలు, జిల్లాల ప్రాతినిధ్యం వంటి అంశాలు తెరపైకి రావడంతో విస్తరణ జరగడానికి బ్రేక్ పడినట్లయింది.

## తెలుగు రాష్ట్రాల్లో దర్శించుకోవాల్సిన రామాలయాలు ఇవే..! ఆ ఆలయాల విశిష్టత తెలుసుకోవాల్సిందే..!

మర్యాద పురుషుడు ఆ శ్రీరాముడు హిందువులకు ఆరాధ్యదైవం. రామ అని పిలిచినందతే కష్టాలు తొలగి సకల శుభాలు కలుగుతాయని పురాణాలు ఘోషిస్తున్నాయి. అందుకేనేమో 'రామాలయం లేని ఊరు ఉండదు.. రాముడిని ఆరాధించని భక్తుడు ఉండడు' అని నానుడి. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీలో ఎన్నో రామాలయాలు ఉన్నాయి. ఆ ఆలయాలకు ఎంతో చరిత్ర ఉన్నది. ఇంతకీ ఆ ఆలయాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకుందాం రండి..! తెలంగాణలోని గోదావరి తీరాన శ్రీరాముడు వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలం. మేరువు, మేనకల కుమారుడు భద్రుడి తపస్సుకి మెచ్చి ఇచ్చిన వరం మేరకు రాముడు సీతాలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి సమేతంగా వెలసినట్లుగా స్థలపురాణం. భద్రాచలానికి క్షేత్రానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉన్నది. భద్రిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పోకల దమ్మక్క అనే భక్తురాలు భక్తిశ్రద్ధలతో రామయ్యను కొలిచేది. ఆ మహా భక్తురాలి భక్తికి మెచ్చి ఓ రోజు శ్రీరాముడు కలలో కనిపించాడు. తాను గతంలో ఇచ్చిన వరం మేరకు.. భద్రగిరిపై కొలువుదీరి ఉన్నానని.. తనను తరించేలా ఏర్పాట్లు చేయమని, నీకు నా పరమభక్తుడు సాయంగా నిలుస్తాడని చెప్పాడు. దమ్మక్క భక్తులతో కలిసి వెళ్లి భద్రగిరి వద్దకు వెళ్లి శ్రీరాముడిని గుర్తించి పందిరి వేసి పండ్లు నైవేద్యంగా పెడుతూ వచ్చింది. ఆ తర్వాత కంచర్ల గోపన్న భద్రాచలంలో రాముడికి ప్రస్తుతం ఆలయాన్ని కట్టించాడు. ఏటా ఇక్కడ జరిగే సీతారాముల కల్యాణం చూసి తీరాల్సిందే తప్ప.. మాటల్లో చెప్పలేం. ఏపీలోని కడప జిల్లాలో ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉన్నది. ఈ ఆలయంలో ఒకే శిలపై కొలువైన సీతారామలక్ష్మణుల విగ్రహాలను అందంగా తీర్చిదిద్దారు. ఎత్తయిన గోపురాలు, విశాలమైన ఆలయ రంగమంటపం, శిల్పకళా వైభవం దర్శించుకునేందుకు రెండు కళ్లు చాలవు. ఈ ఆలయానికి ఎంతో పురాతన ప్రాశస్త్యం ఉన్నది. జాంబవంతుడు కొండపై ఆశ్రమాన్ని నిర్మించాడు. ఉత్తరం వైపును కూర్చొని తారక మంత్రాన్ని జపిస్తూ తపస్సు చేశాడు. మరో గుట్టపై నుంచి రఘురాముడు దివ్యదర్శనం ఇచ్చి వరం ప్రసాదించినట్లుగా స్థలపురాణం చెబుతున్నది. రామయ్యపై భక్తితో సీతారామలక్ష్మణ మూర్తులను ఒకే శిలపై మలచి.. జాంబవంతుడు ప్రాణ ప్రతిష్ట చేసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ఈ ఆలయంలో ఆంజనేయుడు కనిపించడు. ఇక్కడ రామయ్య కల్యాణం వెన్నెల వెలుగుల్లో జరుగుతుంది. ఈ ఆలయం విజయనగరం జిల్లా నెల్లిమర్లలో ఉన్నది. ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉన్నది. తొలి విక్రమేంద్రవర్మ పుత్రుడు ఇంద్రభట్టారక వర్మ 469–496 ఏడీ మధ్యకాలంలో ఇక్కడ రాజ్యపాలన చేశారని, ఆ సమయంలోనే ఇక్కడ ఇచ్చ ఆలయం ఉండేదని స్థల పురాణం. కొన్నేళ్ల తర్వాత ఈ ఆలయ జాడ కనుమరుగైపోయిందని.. మళ్లీ 16వ శతాబ్దంలో ఓ వృద్ధురాలికి ఇక్కడి చెరువులో శ్రీరాముడితో సహా ఇతర దేవతా మూర్తులు విగ్రహాలు లభించాయి. ఈ విషయం తెలుసుకున్న అప్పటి పూసపాటి వంశానికి చెందిన మహారాజు పెద్ద ఎత్తున ఆలయం నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. చెరువులో విగ్రహాలు దొరకడం వల్లే రామతీర్థం అనే పేరువచ్చిందని స్థానికులు చెబుతుంటారు. పూసపాటి వంశానికి చెందిన మహారాజు ఆలయం నిర్మించడమే కాకుండా భూములను ఇనామ్‌గా ఇచ్చారని.. వాటిపై వచ్చే ఆదాయంతోనే ఆలయంలో పూజాధికాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ శ్రీరామ నవమి ఉత్సవాలకు ఎంతో విశిష్టత ఉన్నది. దేవాలయానికి ఉత్తరాన రెండు కిలోమీటర్ల పొడవునా 600 మీటర్లు ఎత్తున్న ఏకశిలా పర్వతం కనిపిస్తుంది. దానిపై సీతారాములతో పాటు పాండవులు సైతం సంచరించారని స్థానికులు చెబుతుంటారు. అలాగే ఇక్కడ జైనులు, బౌద్ధులు సైతం నివసరించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. కోదండ రామాలయం ఏపీలోని కాకినాడకు 20 కిలోమీటర్ల దూరంలోని గొల్లల మామిడాడలో ఉన్నది. 160 అడుగుల ఎత్తు గోపురం ఉంటుంది. ఇక్కడ వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన సూర్యదేవాలయాలు ఉన్నాయి. ఈ గ్రామంలోకి అడుగుపెడుతూనే ఎన్నో గోపురాలు దర్శనమిస్తాయి. ఈ ఆలయాలు వందేళ్ల కిందట అప్పటి జమిందార్లు నిర్మించారని స్థానికులు పేర్కొంటారు. 1889లో ద్వారంపూడి సుబ్బిరెడ్డి, రామిరెడ్డి సోదరులు భూమిని విరాళంగా ఇవ్వగా.. సీతారాముల విగ్రహాలను చెక్కతో చేయించి.. ఆలయాన్ని నిర్మించారు. 1939లో ఓ పెద్ద ఆలయాన్ని నిర్మించారు. ఆలయ తూర్పు, పడమర గోపురాలు వరుసగా 1948–50, 1956–58 సంవత్సరాల మధ్య నిర్మాణం జరిగింది. నవమి ఉత్సవాలకు ఇక్కడికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఈ ఆలయాన్ని చిన్న భద్రాచలంగా పిలుచుకుంటారు. ఇక్కడ శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహిస్తారు. సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరుపుతారు. అలాగే, వైకుంఠ ఏకాదశి, విజయ దశమి ఉత్సవాలు సైతం ఘనంగా జరుగుతాయి. డిచ్‌పల్లిలో రామాలయం ఉన్నది. నిజామాబాద్‌కి 27 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉన్నది. 14వ శతాబ్దంలో కాకతీయ రాజులు ఈ రామ ఆలయాన్ని నిర్మించింది. ఈ ఆలయం శైలి, నిర్మాణంలో చాలా పోలికలు ఇంధూరు ఖజురహో అని పిలుస్తాయి. దీన్నే ఖిల్లా రామాలయం అని కూడా పిలుస్తుంటారు. ఈ ఆలయం పైభాగాన, చుట్టూరా ఉన్న ప్యానెల్ అంతా కూడా వాత్సాయన కామసూత్రల నుంచి స్ఫూర్తి పొంది రూపొందించిన శిల్పాలే కావడంతో అవి సహజంగానే 'ఖజురహో'ను గుర్తుకు తెస్తాయి. ఆలయంపై ఉన్న శిల్పాలను స్థానికులు 'గిచ్చు బొమ్మలు'గా పిలిచేవారని చెబుతారు. సంస్కృతంలో 'గిచ్చు' శృంగారానికి పర్యాయ పదం. అందుకే ఈ ఊరుని 'గిచ్చుపల్లి' పిలిచేవారని.. కాలక్రమేన అదే డిచ్‌పల్లిగా మారిందని చెబుతుంటారు. ఇక్కడ ఆలయంలో లోపల బయట గోడలపై ఉన్న కళారూపాలు కాకతీయుల వైభవాన్ని గుర్తుకు తెస్తుంది. శ్రీరామనవమి రోజున ఇక్కడికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అమ్మపల్లి సీతారామచంద్రస్వామి దేవాలయం హైదరాబాద్‌కు సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్నది. 13వ శతాబ్దంలో వేంగీ చాళుక్యులు ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు భావిస్తున్నారు. సీతమ్మవారు కొలువై వున్న కారణంగానే ఈ ఊరికి 'అమ్మపల్లి' అనే పేరు వచ్చిందని చెబుతుంటారు. ఈ ఆలయం 12వ శతాబ్దం నాటికి చెందిందని స్థలపురాణం చెబుతుంది. ఈ ఆలయం దక్షిణ భారత సాంప్రదాయ నిర్మాణ శైలిలో నిర్మించగా.. రామాయణంలోని సన్నివేశాలను వర్ణించే శిల్పాలతో ఇక్కడ కనిపిస్తాయి.

# మోక్షజ్ఞ తొలి సినిమా కోసం రంగంలోకి మరో డైరెక్టర్ ఇప్పటికైన మోక్షం వచ్చినట్టేనా?



నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం నందమూరి అభిమానులు కళ్లల్లో ఒత్తులు వేసుకొని మరీ ఎదురు చూస్తున్నారు. ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో మోక్షజ్ఞ సినిమాను అనౌన్స్ చేసిన ఈ సినిమా షూటింగ్ పలు కారణాల వలన ఆగిపోయిందని తెలుస్తుంది. కారణాలు అయితే ఇప్పటి వరకు బయటకు రాలేదు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తల ప్రకారం ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్ నుంచి ఔట్ అయ్యాడని, అందుకే సినిమా ఆగిపోయిందని టాక్ గట్టిగా వినిపించింది. కాని ఇంత వరకూ అఫీషియల్ గా మాత్రం ఏ విషయం బయటకు రాలేదు. మోక్షజ్ఞ కోసం డైరెక్టర్ వెంకీ అట్లూరి ఓ మంచి కథను రెడీ చేశారని తెలుస్తోంది. ఈ కథ బాలయ్య కూడా విన్నారని ..దాంతో వెంకీతో మోక్షజ్ఞ సినిమా ఫిక్స్ అయినట్టు సమాచారం. మరోవైపు బాలయ్య సూపర్ హిట్ మూవీ ఆదిత్య 369 సీక్వెల్ తో మోక్షజ్ఞ.. హీరోగా ఎంట్రీ ఇస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. తాజాగా ఆ విషయంపై ఆదిత్య 369 డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు స్పందించారు. తమ మూవీ సీక్వెల్ కోసం అంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని మాకు తెలుసు. అందుకే స్క్రిప్ట్ కూడా సిద్ధం చేశాం. ఆదిత్య 369 సీక్వెల్ తో బాలయ్య.. మోక్షును ఇండస్ట్రీకి పరిచయం చేయాలని అనుకుంటున్నారు. ఎప్పటికైనా సీక్వెల్ చేయాలని మాత్రం బాలయ్య మనసులో ఉంది. అంటే సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో ఆదిత్య 369 సీక్వెల్ ఉంటుందని అర్థమవుతుంది. అయితే వెంకీ అట్లూరి మోక్షజ్ఞ కోసం ప్రత్యేకంగా ఒక స్టోరీ సిద్ధం చేసినట్లు సమాచారం. బాలకృష్ణ కూడా ఈ సినిమా స్టోరీ వినాలనుకుంటున్నారని, కథ నచ్చితే వెంటనే సినిమా షూటింగ్ పనులు ప్రారంభం అవుతాయని తెలుస్తుంది. ఈ సినిమాలో మోక్షజ్ఞ లవర్ బాయ్ పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. ఇలా మోక్షజ్ఞ సినిమాకు సంబంధించి తరచూ ఏదో ఒక వార్త వస్తున్నప్పటికీ ఆయన ఏ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తారనేది సస్పెన్స్‌గా మారింది.





## ఓటీటీలో తమిళ హిట్ సినిమా.. తెలుగులో స్ట్రీమింగ్

కోలీవుడ్‌లో తెరకెక్కిన 'పెరుసు' సినిమా ఎవరూ ఊహించని విధంగా విజయం సాధించింది. ఇప్పుడు ఈచిత్రం ఓటీటీలో విడుదల కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఇందులో నటుడు వైభవ్‌తో పాటు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిహారిక కీలక పాత్రలలో మెప్పించారు. ఆపై సునీల్ రెడ్డి, బాల శరవణన్, రెడిన్ కింగ్స్‌లీ, చాందిని తమిళరసన్ నటించారు. 'టాంటిగో' (శ్రీలంక చిత్రం) ఆధారంగా 'పెరుసు' మూవీని దర్శకుడు ఇళంగో రామ్ తెరకెక్కించారు. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్, బవేజా స్టూడియోస్, ఎంబర్ లైట్ స్టూడియో సంయుక్తంగా నిర్మించాయి. మార్చి 14న కోలీవుడ్‌లో మాత్రమే విడుదలైన పెరుసు చిత్రం మంచి విజయాన్ని దక్కించుకోవడమే కాకుండా విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. కథ తెగనచ్చేసిందంటూ నెటిజన్లు పోస్ట్‌లు పెట్టారు. థియేటర్ రన్ పూర్తి చేసుకున్న పెరుసు ఏప్రిల్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు రానుంది. తమిళ్, తెలుగు, కన్నడ,మలయాళంలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## జి.డి. నాయుడు బయోపిక్‌లో శివానీ రాజశేఖర్

ఆర్. మాధవన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'జి.డి.ఎన్' అనే టైటిల్‌ను ఇప్పటికే ఖరారు చేశారు. భారత ప్రముఖ ఇంజనీరు జి.డి. నాయుడు జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో రాజశేఖర్, జీవితల కుమార్తె కూడా నటిస్తున్నారు. 'ఎడిసన్ ఆఫ్ ఇండియా, మిరాకిల్ మేన్, వెల్త్ క్రియేటర్ ఆఫ్ కోయంబత్తూరు' వంటి పేర్లను గడించిన గోపాల స్వామి దొరైస్వామి నాయుడు షార్ట్‌గా జి. డి. నాయుడు అని కూడా అంటారు. ఇప్పుడు ఆయన జీవితం ఆధారంగా 'జి.డి.ఎన్' మూవీ తెరకెక్కుతోంది. ఈ బయోపిక్‌కు కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగోను మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేశారు. ప్రియమణి, జయరాం, యోగిబాబు ఇతర ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. జీడీ నాయుడు బయోపిక్‌లో టాలీవుడ్ హీరోయిన్ శివానీ రాజశేఖర్ కూడా నటించనుంది. ఇందులో మాధవన్‌తో పాటుగా బిగ్ స్క్రీన్‌పై ఆమె కనిపించనున్నారు. త్వరలో ఈ మూవీ సెట్స్ మీదకు వెళ్తుండటంతో ఏర్పాట్లు స్పీడ్‌గా చేస్తున్నారు. కోయంబత్తూరుకు చెందిన జి.డి నాయుడు కేవలం మూడో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. కానీ, ఆటోమొబైల్, అగ్రికల్చర్, టెక్స్‌టైల్, ఫొటోగ్రఫీ వంటి సెక్టార్స్‌లో కొన్ని పరికరాల ఆవిష్కరణలు చేశారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ ఫీల్డ్‌లో విప్లవం సృష్టించారని చెప్పవచ్చు. భారతదేశంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్ మోటార్‌ను రూపొందించింది ఆయనే కావడం విశేషం. అందుకే ఆయన్ను ఎడిసన్ ఆఫ్ ఇండియాగా పిలుస్తారు. 1893లో జన్మించిన ఆయన 1974లో మరణించారు. ఈ మధ్యకాలంలో మాధవన్ నటిస్తున్న రెండో బయోపిక్ ఇది. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా (2022)లో నటించడంతో పాటు డైరెక్షన్ కూడా చేసి మెప్పించారు మాధవన్. ఈ సినిమాకు జాతీయ అవార్డు వచ్చింది. ఇప్పుడు మళ్లీ మరో బయోపిక్‌లో మాధవన్ నటిస్తుండటం విశేషం. మరి... వెండితెరపై మిరాకిల్ మేన్‌గా మాధవన్ ఏ స్థాయిలో ప్రేక్షకులను మెప్పిస్తారో చూడాలి.






## '14 రోజులు గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లో' చిక్కుకుపోతే..

### ఓటీటీలోకి వచ్చేసిన మూవీ.!

తెలుగు యువ నటులు అంకిత్ కొయ్య, శ్రియా కొంతం జంటగా రూపొందిన రొమాంటిక్ లవ్‌స్టోరీ '14డేస్ గర్ల్‌ఫ్రెండ్ ఇంట్లో'. ఈ సినిమాకు శ్రీహర్ష దర్శకత్వం వహించగా.. సత్య నిర్మించాడు. మార్చి 07న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో నడిచింది. అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ ప్రస్తుతం ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. హర్ష (అంకిత్ కొయ్య) ఎప్పుడు ఫిల్మ్ మేకర్ అవ్వాలని కలలు కంటూ ఉంటాడు. అయితే ఈ క్రమంలోనే హర్షకి ఒక డేటింగ్ యాప్‌లో ఆహాన (శ్రియ కొంతం) అనే అమ్మాయి పరిచయం అవుతుంది. ఇద్దరి స్నేహం కాస్తా ప్రేమగా మారుతుంది. ఆహాన తల్లిదండ్రులు ఒక రోజు పెళ్లికి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేరని హర్షను తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తుంది. అలా తన గర్ల్‌ఫ్రెండ్‌ను కలవడానికి వెళ్లిన హర్షకు అదే ఇంట్లో 14 రోజులు ఉండాల్సి వస్తుంది. ఆహాన తల్లిదండ్రులకు, తాతకు తెలియకుండా హర్ష ఆ ఇంట్లో అన్ని రోజులు ఎలా గడిపాడు? హర్షను దాచడంలో ఆహాన ఎలాంటి కష్టాలు పడింది? పెళ్లికి వెళ్లిన ఆమె తల్లిదండ్రులు ఎందుకు అనుకోకుండా త్వరగా తిరిగి వచ్చారు? ఆహానకు ఎదురైన మరో సమస్య ఏమిటి? ఆ సమస్య నుంచి ఆహాన, హర్ష ఎలా తప్పించుకున్నారు అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే ఈ సినిమాను తప్పక చూడాలి.